సాక్షి
రంగారెడ్డి

శనివారం । 22 । మార్చి । 2025



వరద కాల్వ పరిశీలన

సురంగల్, కనకమామిడి పొలిమేరలో ఆక్రమణకు గురైన వరద కాల్వను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. 8లో▸



మౌలిక వసతుల కల్పన

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
శనివారం సా. 6.33 గం.	ఆదివారం ఉ. 4.56 గం.

న్యూస్‌రీల్

పల్లెల్లో డ్రోన్ల కలకలం



చేవెళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా రాత్రి వేళ డ్రోన్లు సంచరించడం కలకలం రేపుతోంది. మండలంలోని చేవెళ్ల, కందవాడ, ఊరేళ్ల, సింగప్పగూడ, కేసారం తదితర గ్రామాల్లో డ్రోన్లు చక్కర్లు కొట్టాయి. గురువారం రాత్రి 8 నుంచి 9 గంటల సమయంలో డ్రోన్లు తిరిగినట్లు గుర్తించిన కొంతమంది వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఏం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. దీనిపై చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌ను వివరణ కోరగా కందవాడ గ్రామంలో ఆర్ హెచ్ రీసెర్చ్ అనే కంపెనీ పరిశోధనలో భాగంగా కొద్ది రోజుల పాటు డ్రోన్లు ఉపయోగించుకుంటామని అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. వారే డ్రోన్లు వినియోగించి ఉంటారని, ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. ఏదైనా ఉంటే మళ్లీ ఆ కంపెనీ వారితో మాట్లాడి స్పష్టత ఇస్తామని చెప్పారు.

వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీపీఓ సురేష్ మోహన్

కేశంపేట: పంచాయతీ కార్యదర్శులు మూడు రోజుల్లోగా వందశాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ ఆదేశించారు. మండల పరిధిలోని సంగెం గ్రామ పంచాయతీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి గ్రామంలో ఇంటి పన్నుల వసూళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సురేష్ మోహన్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, మురుగు కాల్వలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎల్ఆర్ఎస్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కాగా, పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా నాయకుడు రాంచంద్రయ్య అధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన కార్మికులు డీపీఓకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ మల్లారెడ్డి, ఎంపీడీఓ రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య పాల్గొన్నారు.

ఐపీఎల్ మ్యాచ్‌లకు భారీ బందోబస్తు

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్‌లో జరగనున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు సుమారు 2,700 మంది పోలీసులతో భారీ బందోబస్తు చేపట్టనున్నట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. ఈ నెల 22 నుంచి 18వ ఎడిషన్ టాటా ఐపీఎల్–2025 క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో పలు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాచకొండ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రాచకొండ సీపీ సుధీర్ బాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. లాఅండ్‌ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులతో పాటు షీ టీమ్స్, ఎస్‌బీ, సీసీఎస్, ఎస్‌ఓటీ, ఆక్టోపస్, ఏఆర్ వంటి అన్ని విభాగాల పోలీసులు బందోబస్త్‌లో పాల్గొంటారని తెలిపారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లకు ఉప్పల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఆంక్షలు అమలులో ఉంటాయని, ఈమేరకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. స్టేడియం చుట్టూ 450 సీసీటీవీ కెమెరాలతో నిఘా పెట్టనున్నామని చెప్పారు.

నిమ్స్‌లో కొత్త యూనిట్

లక్డీకాపూల్: అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో కూడిన నిమ్స్ మరో సరికొత్త వైద్య విభాగాన్ని సమకూర్చుకుంది. మూర్ఛ వ్యాధికి గట్టి భరోసా కల్పించే దిశగా అధునాతన పీడియాట్రిక్ న్యూరాలజీ, ఎపిలెప్సీ మ్యానిటరింగ్ విభాగాన్ని అందుబాటులోకి తెచ్చింది. మొయినాబాద్ రోటరీ క్లబ్, ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థల సహకారంలో మిలీనియం బ్లాక్‌లో ఈ యూనిట్‌ని ఏర్పాటు చేసింది. శుక్రవారం ఈ విభాగాన్ని ప్రీమియర్ ఎనర్జీస్ చైర్మన్ సురేంద్ర పాల్‌సింగ్, రోటరీ జిల్లా గవర్నర్ శరత్ చౌదిరి, రోటరీ గవర్నర్ డాక్టర్ ఎస్.రాంప్రసాద్‌తో కలిసి రోటరీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రతినిధి డేనియల్ హిమెల్స్‌పాచ్ ప్రారంభించారు.

నిర్వహణ శూన్యం బకాయి భారం

నామమాత్రంగా వీధి దీపాల నిర్వహణ

- మరమ్మతులు చేయరు.. కొత్తవి బిగించరు
- అంధకారంలోనే రహదారులు, కాలనీలు
- పేరుకుపోతున్న విద్యుత్ బిల్లులు
- మున్సిపాలిటీలకు భారంగా మారిన వైనం

సాక్షి ఫోకస్

మున్సిపాలిటీల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని చోట్ల అలంకార ప్రాయంగా మారాయి. మరికొన్ని చోట్ల నెలల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. కొత్తగా వెలుస్తున్న కాలనీలు రాత్రి వేళ అంధకారంలోనే మగ్గాల్సి వస్తోంది. ఆయా పురపాలికల్లో నిర్వహణ బాధ్యత చూడాల్సిన సంస్థ పట్టించుకోకపోవడంతో భారం మున్సిపాలిటీలపైనే పడుతోంది. మరోవైపు మున్సిపాలిటీల నుంచి చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి.

రూ.32 లక్షల బకాయి

ఆమనగల్లు: వీధి దీపాలకు సంబంధించి విద్యుత్‌శాఖకు మున్సిపాలిటీ దాదాపు రూ.32 లక్షల బకాయి పడింది. మున్సిపల్ పరిధిలో మొత్తం 1,657 వీధి దీపాలు ఉన్నాయి. నూతనంగా వెలసిన కాలనీల్లో ఇంకా ఏర్పాటు చేయాల్సి ఉంది. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్‌కు సంబంధించి 120 స్తంభాలు ఉండగా 240 వీధిదీపాలు ఉన్నాయి. మున్సిపాలిటీలో వినియోగిస్తున్న వీధి దీపాలకు సంబంధించి ప్రతినెలా రూ.1.55 లక్షల దాకా బిల్లు వస్తోంది. ఏడాదికాలంగా చెల్లించకపోవడంతో రూ.32 లక్షల బకాయి ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొత్త కాలనీల్లో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



ఆమనగల్లులో జాతీయ రహదారిపై ఉన్న వీధిదీపాలు

తరచూ మరమ్మతులు

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీలో 3,800 వీధి దీపాలు ఉన్నాయి. మరో 500 వరకు అవసరం ఉన్నాయి. అమర్చిన వాటిలో సరిగా పనిచేయని 150 లైట్లను రీప్లేస్‌మెంట్‌కు పంపించారు. మరో 250 లైట్లకు టెండర్ కాల్ ఫర్ చేశారు. కొత్తగా వెలుస్తున్న కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లను ఏర్పాటు చేయడంలో మున్సిపల్ యంత్రాంగం విఫలం అవుతోంది. ఇబ్రహీంపట్నం నుంచి శ్రీ ఇందు కళాశాల వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినా తరచూ లైట్లు, వైర్లు కాలిపోయి, చెడిపోతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ శాఖకు విద్యుత్ బకాయిలు రూ.25 లక్షలు మున్సిపాలిటీ ఉంటే.. ఆ శాఖ మున్సిపాలిటీకి ప్రాపర్టీ టాక్స్‌ల రూపేణ రూ.32 లక్షల మేర చెల్లించాల్సి ఉంది.



సెంట్రల్ లైట్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నిర్వహణ అంతంతే..

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో వీధి దీపాల నిర్వహణ గతంలో ఈఈఎస్ఎల్ అనే సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ రెండేళ్లుగా నిర్వహణ గాలికి వదిలేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సాగర్ రహదారిపై గుర్రంగూడ చౌరస్తా నుంచి బొంగుళూరు ఔటర్ రింగ్ రోడ్డు వరకు వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. 24 వార్డుల్లో మొత్తం 13,880 వీధి దీపాలు ఉండగా, మరో 2,568 అవసరం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు రూ.2.85 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు మున్సిపల్ డీఈ భిక్షపతి తెలిపారు. ఈఈఎస్ఎల్ సంస్థతో మొత్తం ఒప్పందం కారణంగా సిబ్బందిని నియమించుకోలేక పోతున్నామని పేర్కొన్నారు.

అంధకారంలో కాలనీలు

బడంగ్‌పేట్: పేరుకే పెద్ద కార్పొరేషన్ అన్నట్లు ఉంది పరిస్థితి. కొన్ని కాలనీలు ఇప్పటికీ అంధకారంలోనే మగ్గుతున్నాయి. నివాసాల్లో ఉంటున్నవారు గతంలో ప్రజా ప్రతినిధుల చుట్టూ, ప్రస్తుతం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కార్పొరేషన్‌లో మొన్నటి వరకు వీధి దీపాల నిర్వహణ విషయంలో ఈఈఎస్ఎల్ సంస్థతో ఒప్పందం ఉండేది. ఎక్కడ వెలగకపోయినా.. ఫిర్యాదు వచ్చినా ఆ సంస్థ సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసేవారు. ప్రస్తుతం అగ్రిమెంట్ ముగియడంతో ఆ సంస్థ పట్టించుకోవడం లేదు. వీధిలైట్లు, కొత్త స్తంభాలు అన్నీ మున్సిపల్ అధికారులే చూసుకుంటున్నారు. వీధి దీపాల బకాయి రూ.5 కోట్ల వరకు పేరుకుపోయింది. స్ట్రీట్ లైట్ల విషయంలో కార్పొరేషన్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన రహదారిపై గాంధీనగర్ వద్ద అంధకారం నెలకొంది.

అధ్వానం.. ఆగమాగం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా మారింది. ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు పోతాయో తెలియని పరిస్థితి. ఒక్కోసారి పట్టపగలే వెలుగులు విరజిమ్ముతాయి. మరోసారి రాత్రిళ్లు కూడా అంధకారం నెలకొంటోంది. బల్బులు పోతే మార్చడానికి రోజులు పడుతోంది. మున్సిపాలిటీలో 4,189 వీధి దీపాలు ఉన్నాయి. వీటి నిర్వహణ ఈఈఎస్ఎల్ ఏజెన్సీ చూసుకోవాల్సి ఉంది. ప్రతీ నెల వీరికి రూ.2.6 లక్షలు మున్సిపాలిటీ చెల్లిస్తోంది. వీధి దీపాలు, బోర్లు అన్నింటికీ కలిపి ఏటా విద్యుత్ శాఖకు రూ.7లక్షలు బిల్లు చెల్లిస్తోంది. ఈ ఏడాది ఇంకా చెల్లించలేదు. వీధి దీపాల నిర్వహణ, మరమ్మతుల బాధ్యత ఈఈఎస్ఎల్ సంస్థదే. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఈ సంస్థ చేతులెత్తేసింది. దీంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కంట్రోల్ బోర్డులు, ప్యానెల్స్ మార్చడం మున్సిపాలిటీనే చూసుకోవాల్సి వస్తోంది. 2027వరకు నిర్వహణ సంస్థతో అగ్రిమెంట్ ఉన్నప్పటికీ స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రతీ నెల బిల్లులు పంపుతున్నారు కానీ పనులు చేయడం లేదని, అందుకే కొన్ని నెలలుగా బిల్లులు నిలిపివేసినట్లు తెలిసింది.



సాహెబ్‌గూడలో పగలే వెలుగులు

భారం భరిస్తున్నాం

వీధి దీపాలు, విద్యుత్ బిల్లులు మున్సిపాలిటీ చూసుకుంటుంది. ఏటా రూ.7 లక్షల బిల్లులు చెల్లిస్తున్నాం. నిర్వహణ బాధ్యత ఈఈఎస్ఎల్ సంస్థ చూసుకోవాలి. వారు స్పందించడం లేదు. అనేకమార్లు కమిషనర్ ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు. మళ్లీ భారమంతా మేమే భరిస్తున్నాం.

– స్వర్ణకుమార్, డీఈ



వీధి దీపాలు లేకుండా అలంకారప్రాయంగా విద్యుత్ స్తంభం

కొత్తవి లేవు.. ఉన్నవాటికే మరమ్మతులు

తుక్కుగూడ: పురపాలక సంఘం పరిధిలో 4,754 వీధి దీపాలు ఉన్నాయి. గతంలో వీటి నిర్వహణ, మరమ్మతులు ఈఈఎస్ఎల్ సంస్థ ఆధ్వర్యంలో ఉండేది. గత ఏడాది నుంచి ఈ సంస్థ విద్యుత్ దీపాల నిర్వహణ చేపట్టడం లేదు. ఈ సంస్థకు పురపాలక సంఘం రూ.43 లక్షల బకాయి పడింది. ప్రస్తుతం అధికారులు కొత్త వీధి దీపాలు వేయడం లేదు. ఉన్నవాటికి మున్సిపాలిటీ నిధుల నుంచి మరమ్మతులు చేయిస్తున్నారు.

వెలగని విద్యుత్ దీపాలు



మున్సిపల్ పరిధిలో వెలగని విద్యుత్ దీపాలు

మొయినాబాద్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై రాత్రి సమయంలో అంధకారం అలముకుంటోంది. రహదారి పొడవునా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినా నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి వెలగడం లేదు. మున్సిపల్ కేంద్రంతోపాటు జేబీఐటీ కళాశాల నుంచి అప్పా జంక్షన్ వరకు ఏర్పాటు చేసినవి అలంకారప్రాయంగా మిగిలాయి. మున్సిపల్ కేంద్రంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై గతంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి వెలిగిన దాఖలాలు లేవు. పంచాయతీ ఉన్నప్పుడు ఒకసారి మరమ్మతులు చేయించినా మూన్నాళ్ల ముచ్చటే అయ్యింది. తరువాత తిరిగి వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. జేబీఐటీ కళాశాల నుంచి అప్పా జంక్షన్ వరకు రెండేళ్ల క్రితం కొత్తగా రోడ్డు మధ్యలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల పాటు వెలిగాయి.. నాలుగైదు నెలలుగా వెలగడం లేదు. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన వీధిదీపాలు కొన్నిచోట్ల బాగానే పనిచేస్తున్నా మరి కొన్ని చోట్ల వెలగడం లేదు. ప్రస్తుతం మున్సిపాలిటీ ఏర్పాటు కావడంతో నిర్వహణ మున్సిపల్ అధికారులు చూసుకోవాల్సి ఉంటుంది. ఇంకా మున్సిపల్ అధికారులు వీటిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టినట్లు కనిపించడం లేదు.

విద్యుత్ బిల్లులు పెండింగ్..

మూడు నెలల క్రితం వరకు పంచాయతీలుగా ఉన్న 8 గ్రామాలతో మున్సిపాలిటీ ఏర్పడింది. అప్పటి వరకు పంచాయతీల పేరుతో విద్యుత్ బిల్లులు వచ్చేవి. ప్రస్తుతం మున్సిపాలిటీ ఏర్పడినా ఇంకా పంచాయతీల పేరుతోనే వస్తున్నాయి. విద్యుత్, మున్సిపల్ అధికారుల సమన్వయంతో బిల్లులు మార్చాల్సి ఉంది. రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

వెంటనే స్పందిస్తున్నాం

హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. రహదారి మధ్యలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు తొలగించే అవకాశం ఉంది. ప్రస్తుతం కొన్ని వెలగడంలేదు. విస్తరణలో తొలగిస్తారనే మరమ్మతులు చేయించడంలేదు. వీధుల్లో మాత్రం ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే స్పందిస్తున్నాం.


– ఖాజా మొయిజుద్దీన్, కమిషనర్

ఏడాదిగా నిలిచిన బిల్లులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో అవసరాలకు తగినట్లు ఆర్థిక వనరులు లేకపోవడంతో ప్రజలకు సదుపాయాలు కల్పించేందుకు అధికారులు సతమతమవుతున్నారు. ఇప్పటికే వేలల్లో విద్యుత్ దీపాల అవసరం ఉన్నప్పటికీ నిధుల కొరతతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. సుమారు 1,500 లైట్లకు ఆర్డర్ ఇచ్చి వాటి కోసం నాలుగు నెలలుగా వేచి చూస్తున్నారు. వీధి దీపాల కోసం నిత్యం మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులకు సమాధానం చెప్పలేకపోతున్నారు. శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తా నుంచి బుల్కాపూర్ వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసినా చాలా చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. దీనిని అధికారుల దృష్టికి తీసుకెళ్తే తాత్కాలికంగా మరమమ్మతులు చేసి వదిలేస్తున్నారు.

రూ. 80లక్షలకు పైగా పెండింగ్ బిల్లులు

మున్సిపాలిటీలో మొత్తం 3,145 వీధి దీపాలు ఉన్నాయి. ప్రతీ నెల రూ.7లక్షలకు పైగా విద్యుత్ బిల్లు వస్తోంది. ఏడాది కాలంగా ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో బిల్లుల చెల్లింపు ప్రక్రియను నిలిపివేశారు. దీంతో రూ.80 లక్షలకు పైగా పెండింగ్ ఉన్నాయి. గత ఏడాది ఫిబ్రవరిలో మున్సిపల్ యంత్రాంగం ఎస్‌టీఓ చెక్కుల రూపంలో బిల్లుల చెల్లింపులు చేసినా.. నిధులలేమి కారణంగా అవి నిరుపయోగంగా మారాయి.



బీడీఎల్ చౌరస్తా సమీపంలో వెలగని వీధి దీపాలు

త్వరలో చెల్లిస్తాం

మున్సిపాలిటీలో విద్యుత్ బకాయిలు ఉన్న మాట వాస్తవమే. రానున్న వారం, పది రోజుల్లో పూర్తిగా చెల్లించేందుకు సిద్ధమయ్యాం. ఈ మేరకు ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాం. త్వరలో అవసరమైన చోట వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తాం.

– యోగేశ్, మున్సిపల్ కమిషనర్



చేవెళ్ల: ఆలూరులో విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న పోలీసులు



మీర్‌పేట: జిల్లెలగూడ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

'పది'.. షురూ

పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం 9.30 గంటలలోపే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మొదటిరోజు కావడంతో ఆత్రుతతో ముందుగానే చేరుకొని హాల్‌టికెట్ నంబర్లను చూసుకొని లోనికి వెళ్లారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా 9.35 గంటల వరకు అనుమతించారు. ఆయా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి నెలకొంది. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆమనగల్లు: హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటూ..



ఇబ్రహీంపట్నం: విద్యార్థుల, పేరెంట్స్ సందడి

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రాజేంద్రనగర్: పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ సరళిని పరిశీలించారు. వేసవి అయినందున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మెయిన్ గేట్ వద్ద విద్యార్థినీ విద్యార్థులను వేర్వేరుగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపాలని పోలీసులకు సూచించారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ తదితరులు ఉన్నారు.

పెళ్లి చేసుకుంటానని..

- బాలికను ఎత్తుకెళ్లిన యువకుడు
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

యాచారం: ప్రేమ, పెళ్లి పేరిట ఓ బాలికను యువకుడు అపహరించుకుపోయాడు. ఈ ఘటన యాచారం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సపూరి సంజయ్‌ప్రసాద్, మంజు దంపతులు తమ 14 ఏళ్ల కూతురుతో కలిసి మొండిగౌరెల్లిలోని ఓ పౌల్ట్రీఫాంలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నారు. సికింద్రాబాద్ సమీపంలోని గాంధీనగర్‌లో ఉండే బీహార్‌కు చెందిన సునీల్ కుమార్(19) మూడు నెలలుగా బాలికతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో ప్రేమిస్తున్నానని, త్వరలో పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఈ నెల 19న బాలికను తీసుకెళ్లాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు తమ కూతురును సునీల్‌కుమార్ అపహరించుకుపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సునీల్‌కుమార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజా ప్రకటన

తేది : 23-03-2025 నాకు హ క్లైయింటు అయిన శ్రీ పూర్ణచంద్రారెడ్డి తండ్రి జనార్దన్‌రెడ్డి మరియు ఇతరులు యొక్క కేసు No.K/1298/2017, సర్వే నం.28లో విస్తీర్ణము ఎ 16-20 గుం॥ సోలిపూర్ గ్రామము, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా (Land Mark Opposite) Noor Engineering College మరియు Case No.C/862/2019, Sy No.18, 19 విస్తీర్ణం ఎ 12-29 గుం॥ మరియు ఎ 12-28 గుం॥లు సోలిపూర్ గ్రామము, ఫరూఖ్‌నగర్ మం॥, రంగారెడ్డి జిల్లాలో గల భూమికి రక్షిత కౌలుదార్లు యొక్క కేసు ఆర్డీఓ, షాద్‌నగర్ ఆఫీసులో కేసు ఉన్నవి. కావున ఆట్టి భూమి కొన్న మరియు విక్రయించిన నా క్లైయింటు తీసుకోబోయే వచ్చినట్టు వారు బాధ్యులు కావారు అని తెలియచేయుచున్నాను.

సం/- కాసు బాలరెడ్డి అడ్వకేట్
మహబూబ్‌నగర్. సెల్ : 9948130127

మట్కాతో మస్కా!

ఆన్‌లైన్‌లో నకిలీ బెట్టింగ్ వెబ్‌సైట్ సృష్టి

- పెట్టుబడులతో లాభాలు అంటూ వీడియోలు
- వ్యవస్థీకృతంగా నడుపుతున్న ఐదుగురు
- చెక్ పెట్టిన మధ్య మండల టాస్క్‌ఫోర్స్


పోలీసులకు పట్టుబడిన నిందితులు

సాక్షి, సిటీబ్యూరో: ముంబై కేంద్రంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో సాగే సింగిల్ నంబర్ లాటరీలు సట్టా, మట్కా పేర్లతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి.. డమ్మీ వీడియోలు పోస్టు చేసి.. అమాయకుల్ని నిలువునా ముంచుతున్న ముఠాకు మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ పెట్టారు. ఐదుగురు నిందితులను పట్టుకుని, వారి నుంచి నగదుతో పాటు ఈ బెట్టింగ్ నిర్వహణకు ఉపకరించే సామగ్రి సైతం స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వెల్లడించారు.

నిర్వహణ విధానం తెలుసుకుని..

కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన ఎస్.శ్రీకాంత్, జి.హరీష్, జి.సతీష్‌కుమార్, ఎస్.తిరుపతి, ఎ.వినోద్ స్నేహితులు. ఇంటర్మీడియట్ వరకు చదివిన వీళ్లు తమ స్వస్థలంలో కార్పెంటర్లుగా కొన్నాళ్లు పని చేశారు. వీరికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో సట్టా, మట్కా ఆడే అలవాటు ఉంది. ఏళ్లుగా పందేలు కాస్తున్న వీరు.. ఆయా బెట్టింగుల నిర్వహణ విధానం తెలుసుకున్నారు. దేశవ్యాప్తంగా అనేక మంది వీటి ద్వారా పందేలు కాస్తుండటంతో వారి బలహీనతల్ని క్యాష్ చేసుకోవాలని పథకం వేశారు. వివిధ పేర్లతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి, వాటి ద్వారా అసలు మట్కా, సట్టా పేర్లతో పలువురిని ఆకర్షించాలని నిర్ణయించుకున్నారు.

నెలకు రూ.25 వేల అద్దె ఇల్లు

దీనికోసం ఈ ఐదుగురూ మూడు నెలల క్రితం హైదరాబాద్ చేసుకున్నారు. మధురానగర్ ప్రాంతంలో నెలకు రూ.25 వేల అద్దెకు ఓ ఇంటిని తీసుకున్నారు. అందులో మ్యాక్‌బుక్, ట్యాబ్, రెండు ప్రింటర్లు తదితరాలు సిద్ధం చేసుకున్నారు. తమ స్వస్థలంలో ఉన్న చుట్టుపక్కల పేదలు, డబ్బు అవసరమైన వారిని ఆకర్షించారు. వారికి ఎంతో కొంత ముట్టచెబుతూ వారి పేర్లతో సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు తీసుకున్నారు. వీటి ఆధారంగా నెట్‌బ్యాంకింగ్, యూపీఐ ఖాతాలు యాక్టివేట్ చేసుకున్నారు. ఆపై శ్రీదేవి, కళ్యాణ్, మిలన్, థాయ్ లాటరీల పేర్లతో నకిలీ వెబ్‌సైట్ తెరిచారు. బోగస్ వ్యక్తులతో తాము వాటిలో పెట్టుబడి పెట్టి భారీ లాభాలు పొందామంటూ వీడియోలు చేయించారు.

ప్రత్యేకంగా యూట్యూబ్ చానల్

ఈ వీడియోలను ప్రచారం చేయడానికి ప్రత్యేకంగా త్రికాల్ మట్కా పేరుతో యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేశారు. అందులోని వీడియోలను చూసిన వాళ్ల సంప్రదించడం కోసం ఫోన్ నెంబర్లూ పొందుపరిచారు. ఇలా తమకు సంప్రదిస్తున్న వారిని బుట్టలో వేసుకుంటున్న ఈ ముఠా తొలుత రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో రూ.1000 చొప్పున తీసుకుంటోంది. ఆపై వారికి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తోంది. వీటి ద్వారా లాగిన్ అయిన వాళ్లు తొలుత చిన్నమొత్తాలు వెచ్చిస్తున్నారు. అప్పుడు వారికి లాభాలు వచ్చినా.. పెద్ద మొత్తాలు పెట్టిన తర్వాత నష్టపోయేలా ఆ వెబ్‌సైట్‌లో ప్రోగ్రామింగ్ చేశారు. చిన్న లాభాలు పొందిన వారికీ ఆ మొత్తాలు తిరిగి ఇవ్వకుండా నిండా ముంచుతున్నారు.

దాడి చేసి పట్టుకున్న టాస్క్‌ఫోర్స్

ఈ ఐదుగురు నిందితులు కొన్నాళ్లుగా ఈ దందా సాగిస్తున్నారు. వీరి వ్యవహారాలపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. శుక్రవారం మధురానగర్‌లోని వీరి ఇంటిపై దాడి చేసిన అధికారులు ఐదుగురినీ పట్టుకున్నారు. ఆ ఇంటి నుంచి మాక్ బుక్, ట్యాబ్, రెండు కలర్ ప్రింటర్లు, సట్టా, మట్కాకు సంబంధించిన కరపత్రాలు, బెట్టింగ్ చార్ట్స్, సెల్‌ఫోన్లు, రూ.1.55 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను మధురానగర్ పోలీసులకు అప్పగించారు. ఓపక్క సోషల్‌మీడియాలో 'హ్యాష్ ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్' ప్రచారం జోరుగా సాగుతుండటం... నగరంలో ఈ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదవుతున్న తరుణంలో ఈ నకిలీగాళ్లు చిక్కడం గమనార్హం.

తల్లీకొడుకు అదృశ్యం


కామిని(ఫైల్)

చేవెళ్ల: లేడీస్ టైలర్ వద్దకు వెళ్తున్నానని రెండేళ్ల కుమారుడితో వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన మండల పరిధిలోని ముడిమ్యాలలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఎంజాల కామిని(24), మహేందర్ దంపతులు. వీరికి రెండేళ్ల కుమారుడు సంతానం. గురువారం బ్లౌజ్ కుట్టించుకుంటానని కుమారుడితో కలిసి వెళ్లిన కామిని రాత్రయినా తిరిగి రాలేదు. వారి కోసం మహేందర్ ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన శుక్రవారం చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

Last Chance 10th. Inter Direct Degree (Dist), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma MA, M.Com, M.Sc, MBA MCA Regular/ Lateral Entry Ph: 9490577501 [H-783371]

Real Estate

FLAT FOR SALE

HMDA & RERA అప్రూవ్డ్ లగ్జరీ అపార్ట్‌మెంట్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు దగ్గరలో తుక్కుగూడ వద్ద కలవు. క్లబ్ హౌస్, గే.క. 75% లోన్. 7680829195 [HA-1077]

3 BHK Flats for Sale in Doctors Colony, LB Nagar, (M) Ph :7997846999 [HA-09931]

New Flats for Sale at Surya Nagar Alwal, 1125Sft, 2BHK, 1st, 2nd, 3rd, 4th floors, Ready to Occupy, 5000 per sq.ft, UDS 48 sq.yds per flat, Loan Available No Brokers. Ph:9703361333 [HA-6310]

D.V. Township, Old Safilguda, Block - 6, 2BHK, 920 Sft, W/F, 42L. Block -5, 3BHK, 1820 sft W/F, Woodwork, 75L. Near Dr. A.S.Rao Nagar. Ph: 9000252815 [HA-00149]

Peddaamberpeta, Sai Nagar, Vijayawada Highway, W/F 2200 sft, 1 Flat for Floor, Lift + Car Parking. Ph: 7842304717. 8985193039 [HA-15121]

LAND FOR SALE

100 అడుగుల మెయిన్ రోడ్‌కి 3వ ప్లాటు 296 గజాల N/W కార్నర్ ప్లాటు అమ్మబడును @ మహేశ్వరం టౌన్, ఇండ్లకు-బస్‌స్టాప్ ఆనుకొని DTCP ఫైనల్ అప్రూవల్ Rs:11 వేలు గజం. Ph: 9966521191 [H-800529]

ఈ వారం లోపు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకొంటే సాగర్ హైవే RRR దగ్గరలో గజం కేవలం 1999/- మాత్రమే. @ 9030405854 [HA-09464]

Mumbai Highway 200 Feet Road, North Facing 2.25 Acres clear title Land for Sale with NA near To Woxen University Beside Residential Zone, 7396602495 / 8297771369. [HA-1263]

PLOT FOR SALE

కమర్షియల్ Plots for Sale శ్రీశైలం హైవే ఫేసింగ్ @ కందుకూరు, గేటెడ్ కమ్యూనిటీ, Near Future City, 4th City. Ph: 9849905169 [HA-15168]

సాగర్ హైవే, శ్రీశైలం హైవేలో Future సిటీకి దగ్గర్లో DTCP అప్రూవ్ ఓపెన్ ప్లాట్స్ కలవు. EMI + బ్యాంక్ లోన్. Ph: 9701893302/9398495831 [HA-5051]

Services

BUSINESS SERVICE

మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800528]

PERSONAL CARE

CHANGE OF NAME

I, K.ANASOORYA, D/o K. YADHAIAH, R/o 3-5-24/R117, Meerpet, Moula-ali, Hyd-40, Have Changed My Name from Kommu Anasurya to K.Anasoorya (DOB: 15/05/1973) [HA-1267]

I, Alijarla Shiva Prasad Reddy S/o Alijarla Malla Reddy R/o: H.no 21-58, Vi) Malla Reddy Guda Mdl) Shabad, RR Dist Changed My Name From A Shiva Prasad Reddy to A Shiva Ram Reddy [SCA25002279]

I, SHAIK RASHI, S/o. Shaik Abdul Raffi, R/o. Sy.no: 822 & 823, Lapracy Colony, Balajinagar, Kapra, Medchal-Malkajgiri, T.S. have changed my name as 'ASMA' [HA-15496]

OLD AGE HOME

వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మెడిపల్లి, దీర్ఘకాలిక మంచానపున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్ చీర్యాల్ 'x' రోడ్ భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783370]

Wanted

Hyd టాప్ కన్సల్టెన్సీలో పనిచేయుటకు డిగ్రీ చదివిన 30 మంది (F) కావలెను. ఫిక్స్‌డ్ జీతం 10-15 వేలు+ Inc. దిల్‌షుఖ్‌నగర్. Ph: 9849756992 [SCA25002270]

యాదాద్రి భువనగిరి, వలిగొండ మండలం, టెకులసోమారం విలేజ్‌లో గోడౌన్ మెయింటైన్ చేయుటకు సూపర్‌వైజర్ కావలెను. జీతం : 14000/-. సంప్ర: 9177563939 [HA-2060]

లేడీస్ హాస్టల్‌లో వంట చేయడానికి 45-50 సం॥లు వయస్సు ఉన్న సింగిల్ లేడీ కావలెను. వసతి, ఉచిత భోజనం & నెల జీతం ఇవ్వబడును. అడ్రస్ : దిల్‌సుఖ్‌నగర్. Ph: 9985295227 [HA-15166]

HYDలోని 5స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ & హెల్పర్స్ కావలెను. జీ:12-16K రూమ్+ఫుడ్ ఇది కన్సల్టెన్సీ కాదు. age 18-30. Ph: 9989978685 [SCA25002227]

Hyd లో పనిచేయడానికి సెక్యూరిటీ ఆఫీసర్లు M-1, సెక్యూరిటీ సూపర్‌వైజర్ M-2, రిసెప్షనిస్ట్ F-1 కావలెను any Degree. Cell: 8019484141 [W-SCA25002247]

సాయిరామ్ హోమ్‌కేర్ Hydలో బేబీ & పేషెంట్ కేర్ ముసలివారిని చూసుటకు ఆయాలు/ నర్సులు ఇంటి/వంటపనికి ఆడ/ మగ కావలెను. జీ: 18 వేలు. 9949094607 [SCA25002179]

హైదరాబాద్‌లో ఇంట్లోనే ఉండి ఇంటి, వంట పనికి, పిల్లలను, పెద్దలను చూసుకొనుటకు ఆడవాళ్లు కావలెను. జీతం 18-30K. ఫోన్: 8019373131 [H-800524]

అర్జెంట్‌గా హైదరాబాద్ కొరకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం : 12,000 + ESI + PF +Room+Food. Non Veg Cutting Master కావలెను. Ph: 8639110999, 9398915299 [HA-15167]

WANTED Female Telecaller GVR Educational Academy Any Degree Goodsalary +incentive Chaitanyapuri DSNR9666072099. [SCA25002271]

Wanted M/F Exp/Fresh Telecallers with Good Communication Skills @ Attapur. Salary Rs. 12K to 18K+ Commission. Ph: 8074771087 [HA-4009]

FACULTY TEACHERS

Wanted Teachers, PRO's & Drivers For St.paul's High School Aushapur, Hyderabad. Contact: 9989602252, 9515405001 [HA-34115]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్స్), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

అక్రమంగా మట్టి తరలింపు


పోలీసుల అదుపులో నిందితులు, సీజ్ చేసిన టిప్పర్లు

- మూడు టిప్పర్లు, జేసీబీ సీజ్
- ఎనిమిది మందిపై కేసు

మహేశ్వరం: అక్రమంగా మట్టి తరలిస్తున్న మాఫియాపై పోలీసులు కేసు నమోదు చేసి నాలుగు వాహనాలను సీజ్ చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని గంగారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గంగారం సర్వే నంబర్ 85లో ఉన్న ప్రభుత్వ భూమిలో కబ్జాలో ఉన్న గ్రామస్తుడు మునావత్ రెడ్యానాయక్‌కు డబ్బులిచ్చిన కత్రావత్ లక్ష్మణ్, మునావత్ నగేశ్, మునావత్ రాజేశ్ మట్టి తవ్వకాలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున దాడి చేసి మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశారు. మట్టిని విక్రయించిన వ్యక్తితో పాటు లక్ష్మణ్, నగేశ్, రాజేశ్, వారి టిప్పర్ డ్రైవర్లు మెగావత్ రాజు, జెటావత్ తుల్సానాయక్, సందీప్ కుమార్ దాస్, మునావత్ కృష్ణం రాజుపై కేసు నమోదు చేశారు. మూడు టిప్పర్లు, ఓ ఇటాచీ వాహనాన్ని సీజ్ చేశారు.

క్రీడలతో నూతనోత్తేజం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం


ఊరెళ్ల జట్టుకు బహుమతి అందజేస్తున్న కేఎస్ రత్నం, దయాకర్

చేవెళ్ల: క్రీడలు యువతలో నూతన ఉత్తేజాన్ని నింపుతాయని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. పట్టణ కేంద్రంలో నెల రోజులుగా కొనసాగుతున్న పెద్దోళ్ల పర్మయ్య మెమోరియల్ మండల స్థాయి క్రికెట్ టోర్నీ శుక్రవారంతో ముగిసింది. ఈ పోటీల్లో విజేతలకు పర్మన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దయాకర్, కేఎస్ రత్నం నగదు బహుమతులు అందజేశారు. విజేత జట్టు ఊరెళ్లకు రూ.50వేలు, రన్నరప్ జట్టు రామన్నగూడకు రూ.25వేల నగదు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా దయాకర్, కేఎస్ రత్నం మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కె. శివప్రసాద్, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, జహంగీర్, నర్సింలు, పి. ప్రభాకర్, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం


నందిగామ: రాజ్ భూపాల్‌ను సన్మానిస్తున్న అరవింద్


ఇబ్రహీంపట్నం: రాజ్‌భూపాల్‌గౌడ్‌కు మొక్క అందజేస్తున్న బీజేపీ నేతలు

నందిగామ: బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాజ్‌భూపాల్‌గౌడ్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆయన పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి శంషాబాద్‌లోని పార్టీ కార్యాలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ పటిష్టతకు కృషి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందనేందుకు రాజ్‌భూపాల్‌గౌడ్ ప్రత్యక్ష సాక్షి అన్నారు. పార్టీ ఆయన సేవలను గుర్తించి పార్టీ రూరల్ జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మనోహర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్, నాయకులు కమ్మరి భూపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ

ఇబ్రహీంపట్నం: బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్‌ను ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నేతలు శుక్రవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భూపాల్‌గౌడ్‌ను శాలువతో సన్మానించి, మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, శ్రీశైలం, రమణారెడ్డి, బుగ్గారెడ్డి, స్వామిగౌడ్, నర్సింహ, బాలశివుడు, బాబు, కృష్ణ, రాజు, విజయ్, సురేశ్, శేఖర్, దాసరి, రవి, యాదయ్య, వెంకట్‌రమణ పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలి

గిరిజన సంఘాల జేఏసీ డిమాండ్

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా బకాయి ఉన్న రూ.219 కోట్ల ట్రైకార్ రుణాలను మంజూరు చేయాలని గిరిజన సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. అలాగే ఇదే డిమాండ్‌పై ఏప్రిల్ 7న జరిగే సంక్షేమ భవన్ ముట్టడి కార్యక్రమానికి లబ్ధిదారులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చింది. రాజీవ్ యువ వికాసం పథకం పేరుతో ట్రైకార్ రుణాలు రద్దు చేసే కుట్ర అనే అంశంపై శుక్రవారం హిమాయత్‌నగర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ నేతలు ఆర్.అంజయ్య నాయక్, ఎం.ధర్మ నాయక్, అజ్మీర రాంమూర్తి నాయక్, ఆర్.శ్రీరామ్ నాయక్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలోని ట్రైకార్ సంస్థను నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకంలో విలీనం చేసిందని ఆరోపించారు. ట్రైకార్ సంస్థలో యూనిట్ విలువ రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉండగా, కొత్తగా తీసుకువచ్చిన ఈ పథకంలో రూ.4 లక్షల వరకే పరిమితి ఉందని ఆరోపించారు.

గొడ్డలితో గొంతుపై నరికి

- భార్యను హత్య చేసిన భర్త
- మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదని దారుణం
- నిందితుడికి రిమాండ్


జమున(ఫైల్)

షాద్‌నగర్ రూరల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి తన భార్యను దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. పట్టణ సీఐ శంకరయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పరశురాములు, జమున (38) భార్యాభర్తలు. వీరి ఇద్దరు కూతుళ్లకు పెళ్లి చేయడంతో అత్తవారి ఇళ్లలో ఉన్నారు. పరశురాములు కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మరింత మద్యం కోసం డబ్బులు ఇవ్వమని భార్యతో గొడవ పడ్డాడు. ఇందుకు ఆమె నిరాకరించడంతో కోపోద్రిక్తుడై ఇంట్లోని గొడ్డలితో జమున గొంతుపై దాడి చేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భూమి డబ్బుల కోసమే..

గతంలో అమ్మిన భూమికి సంబంధించిన రూ.2.50 లక్షలను జమున తెలిసిన వారికి అప్పుగా ఇచ్చింది. భార్యను చంపితేనే ఆ డబ్బులు తనకు వస్తాయని భావించిన పరశురాములు.. నిద్రిస్తున్న జమునపై గొడ్డలితో కిరాతకంగా దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. నిందితుడిని పట్టుకున్న పోలీసులు అతన్ని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. హత్యకు వినియోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు


మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న మాచన్‌పల్లి గ్రామస్తులు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాచన్‌పల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5లక్షల ఎస్‌సీపీ నిధులు కేటాయించడంతో శుక్రవారం ఆయన్ను గ్రామస్తులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యగౌడ్, నరేందర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, చందు, మహేందర్, శేఖర్, నరేష్, ముసలయ్య, మల్లేష్, రఘు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


సీతారామాంజనేయ స్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో వెలసిన శివ సీతారామాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేశ్, స్థానిక నాయకులు నరోత్తమ్‌రెడ్డి, బాలకుమార్‌గౌడ్, నర్సింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పర్వతాలు, గిరి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద కాల్వ పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..


వరద కాలువను పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్, రెవెన్యూ అధికారులు

మొయినాబాద్: సురంగల్, కనకమామిడి పొలిమేరలో ఆక్రమణకు గురైన వరద కాల్వను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మొయినాబాద్‌లోని సురంగల్, కనకమామిడి రెవెన్యూల్లో వెంచర్ ఏర్పాటుకు రియల్టర్లు కాల్వను పూడ్చేసి చదును చేయడంపై 'వరద కాలువ మాయం'అనే శీర్షికతో గురువారం 'సాక్షి'దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్, సర్వేయర్ వరద కాలువను పరిశీలించారు. సురంగల్, కనకమామిడి, నజీబ్‌నగర్ రెవెన్యూల పొలిమేర నుంచి వరద కాలువ ఉన్నట్లు విలేజ్ మ్యాప్‌ను పరిశీలించి గుర్తించారు. నీటి వనరులను, వరద కాలువలను పూడ్చివేసినా, ఆక్రమించినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. ఆక్రమణకు గురైన వరద కాలువను పునరుద్ధరిస్తామన్నారు. వరద కాలువను పూడ్చినవారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

అమెరికాలో మృతిచెందిన వారి అంత్యక్రియలు పూర్తి


సంస్మరణ సభలో పాల్గొన్న మృతుల బంధువులు, కుంటుబ సభ్యులు

షాద్‌నగర్: అమెరికాలోని ఫ్లోరిడాలో ఈనెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి అంత్య క్రియల్లో పాల్గొన్న బంధువులు, కుటుంబ సభ్యులు మృతులకు తుది వీడ్కోలు పలికారు. కొందుర్గు మండలం టేకులపల్లికి చెందిన మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, పవిత్ర దంపతుల కూతురు ప్రగతిరెడ్డి, మనమడు హార్విన్‌రెడ్డి చనిపోయిన విషయం తెలిసిందే. మృతదేహాలను ఇండియాకు తెచ్చే అవకాశం లేకపోవడంతో అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. భారత కాలమాణం ప్రకారం గురువారం రాత్రి 10గంటలకు ఓర్లాండో అవెన్యూలోని ఫ్యూనరల్ హోం శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో మృతులతో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



అబ్దుల్లాపూర్‌మెట్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... మండల పరిధిలోని అనాజ్‌పూర్ గ్రామంలోని శివాలయం వద్ద బస్టాండ్‌లో శుక్రవారం గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో ఉంది. సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి సూరిబాబు అక్కడికి చేరుకుని 108 వాహనానికి ఫోన్ చేశారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది మహిళను పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా మృతిచెందిన మహిళ స్థానికంగా భిక్షాటన చేసుకుంటూ ఉండేదని స్థానికులు తెలిపారు.

ప్రాణం తీసిన అతివేగం

- బైక్ అదుపుతప్పి విద్యార్థి దుర్మరణం
- మరో యువకుడి పరిస్థితి విషమం


అరుణ్ మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: అతివేగం ఒకరి ప్రాణం తీయగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. తుర్కయంజాల్ ప్రాంతానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి అరుణ్(21) తన స్నేహితుడితో కలిసి హైదరాబాద్ నుంచి రావిర్యాల్ మీదుగా బొంగ్లూరు వైపు ప్రయాణిస్తున్నారు. రావిర్యాల్ చెరువు సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కేటీఎం బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొడుతూ వెళ్లి గోడను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అరుణ్ అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడు మహేందర్ కాలు విరగడంతో పాటు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తరలించారు. అరుణ్ మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.